అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023 పేజీలు : 04

### 300 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకుని

# శ్రీశైలంకి చేరుకున్న పిజెఆర్



పాదయాత్రలోని దృశ్యం

**అనంతపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త బ్యూరో**

కాలినడకన కొండలలో వెళ్లే శివ భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వీరభద్ర కొలనులో 1లక్ష, పె చెరువులో అన్న సేవా కార్యక్రమానికి 2 లక్షలు టిడిపి నేత పిజెఆర్ అందజేశారు. అనంతపురంలో ఫిబ్రవరి 3న ప్రారంభమైన పాదయాత్ర గురువారం 300 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకుని శ్రీశైలంకు చేరినట్లు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. అనంతరం పెరుమాళ్ల జీవానందరెడ్డి మాట్లాడుతూ.. అనంతపుంర జిల్లా నుంచి కర్నూలు జిల్లా మహాపుణ్యక్షేత్రం శ్రీశైలంకి 300 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేశానని గత ఏడు సంవత్సరాలుగా పాదయాత్ర చేస్తున్నానని ఏడవ సంవత్సరం అని ఏడు అడుగుల శివలింగంతో అనంతపురం నుంచి శ్రీశైలానికి శివనామ స్మరణంతో శివ భక్తుల నడుమ శ్రీశైలం వరకు పాదయాత్ర చేశానన్నారు. లోక కళ్యాణార్థం కోసం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రైతన్నలు ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర చేశాన న్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన నడుస్తుందని సైకో పోయి సైకిల్ రావాలని ఆ శివపార్వతులను వేడుకుంటున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడు రావాలన్నారు. మనమందరం కలిసి నారా చంద్రబాబునాయుడు గారిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. నల్లమల అడవులలో పాదయాత్ర చేసే భక్తులకి శివ స్వాముల కోసం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన వీరభద్ర కొలనులో లక్ష రూపాయలు, పెచెరువులో నిర్వహించిన అన్న సేవా కార్యక్రమానికి రెండు లక్షల రూపాయలు చెక్కును అందజేశానన్నారు. అడవులలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీరభద్ర కొలనులో జీవానందరెడ్డిని శాలువా పూలమాలతో సన్మానించారు. శ్రీశైలంకి వచ్చిన భక్తాది భక్తుల కోసం బాల గణేశాపార్క్‌లో అన్న సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నానన్నారు.



అన్నదానానికి చెక్కును అందజేస్తున్న పిజెఆర్



# నిర్వాసితులకు న్యాయమైన పరిహారం

### - జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్ర హైవే నిర్మాణంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో 650 హెక్టార్ల భూమిని సేకరించడం జరిగిందని, ఫిబ్రవరి మాసానికి 300 హెక్టార్ల భూమికి సంబంధించిరైతులకు న్యాయమైన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ వివరించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో రీసర్వే, ఇంటిస్థలాలు, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖలు, గ్రామ వార్డులసచివాలయం వ్యవస్థ, ఈ క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంబంధిత కార్యదర్శులతో అమరావతి నుండి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నందు శ్రీ సత్యసాయి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.ఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై జిల్లాలో చేపడుతున్న భూ హక్కు భూరక్ష రీ సర్వేలో గ్రౌండ్ వ్యాలిడేషన్ డిఎల్ఆర్ పబ్లిష్ చేయడం హక్కు పత్రాలు అందజేయడం వంటివి ఫిబ్రవరి మాసాంతానికి సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జాతీయరహదారులు ఎపిఐఐసి కొరకు భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చయాలన్నారు. స్పందన అర్జీలపై సకాలంలో స్పందించి బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్ళకుండా అర్థవంతమైన పరిష్కారం అర్జీదారులకు చూపాలన్నారు. రెవెన్యూ అంశాలు మరింత జాగ్రత్తగా పరిశీలన త్వరితగతిన అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కరించాలని, ఈ అంశం సిఎంఓ స్థాయిలో సమీక్షిస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రబీవరి పంటకు ఈ క్రాపింగ్ పూర్తి చేయాలని, వరిధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థ సన్నద్ధం కావాలని అన్నారు. సూపర్ చెక్ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చిందని తహశీల్దార్లు, ఆర్‌డిఓలు, అగ్రికల్చర్ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. పిఎం కిసాన్ ఈ కెవైసి సకాలంలో పూర్తి చేయాలని, ఏదైనా తగ్గుదల ఉంటే సరిఅయిన కారణాలు నివేదికలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, సుబ్బారావు, చంద్రశేఖర్, పద్మావతి, హౌసింగ్ అధికారి చంద్రమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్‌అధికారి రషీద్, డ్వామా అధికారి రామాంజినేయులు, పంచాయతీరాజ్ సూపరిటెండెంట్ ఇంజనీర్ గోపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



హాజరైన సంబంధిత శాఖల అధికారులు

# మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

### - సచివాలయం కన్వీనర్లు మరియు గృహసారథుల శిక్షణా కార్యక్రమం
### - ఎమ్మెల్యే మాలగుండ్ల, పెనుకొండ నియోజకవర్గం పరిశీలకులు బాబురెడ్డి



కన్వీనర్లకు దిశా నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**

గోరంట్ల పట్టణంలోని షాదిమహల్‌లో మండల పరిధిలోని వానవోలు గ్రా మ పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో గురువారం మలసముద్రం, గౌని వారిపల్లి, కమ్మవారిపల్లి, వానవోలు మరియు వానవోలుతాండా సచివా లయం కన్వీనర్లు మరియు గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడాలేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో పాటు గృహసారథులు కన్వీనర్లను ఎంపిక చేయడం జరిగిందని, ప్రతి ఇంటికి వెళ్లి వారికి కేటాయించిన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిం చడంతో పాటు వారి సమస్యలను తెలు సుకోవడం జరుగుతుందని, బాధ్యతగా ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధంగా పనిచేయాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్య మం త్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చూడాలని ఆయన పిలుపు ని చ్చారు. ఈ కార్యక్రమంలో గో రంట్ల మండల సచివాలయం కన్వీనర్, ఎంపిపి, ఎంపి టిసి లు, మండల కన్వీనర్, సర్పం చులు, వైసిపి నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అసౌకర్యం కలగకుండా సకల ఏర్పాట్లు చేయాలి - ఎమ్మెల్యే సిద్దారెడ్డి



నరసింహస్వామి తిరునాళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**కదిరి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ధి గాంచిన లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, అంగ రంగ వైభవంగా జరిగే తిరునాళ్లు(తేరు) ఉత్సవాలకు వచ్చే భక్తులకు సకల ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం బ్రహ్మోత్సవాల నిర్వహనపై ఆలయ చైర్మన్ జరిపిటి గోపాల కృష్ణ, ఇఓ పట్టె గురుప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ.. మార్చి 2వ తేదిన అంకురార్పణతో ప్రారంభమయ్యే ఖాద్రీషుని ఉత్సవాలు, 16వ తేది వరకు విశేషంగా ఉత్సవాలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మో త్సవాల నిర్వహనకు సంబంధించి ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతి నిధులు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసి భక్తుల కు వసతి సౌకర్యాలు కల్పిం చాలని సూచించారు. కర్ణాటక, తమిళనాడు ఇరు రాష్ట్రాల నుంచి తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోనేరును శుభ్ర పరిచి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనాన్రు. బ్రహ్మత్సవాల అనంతరం కోనేటి నిర్మాణాన్ని ఎంతో ఆధునీక రణగా చేపడుతామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, పోలీసు అధికా రులు సమన్వయంతో తిరువీ ధులలో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టిటిడి కళ్యాణ మండప ఆవరణం, తిరుమలతిరుపతి దేవస్థానం ద్వారా ఇప్పటికే 33 సంవత్స రాలు లీజుకు తీసుకున్నామని, రా బోయే రోజుల్లో ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేప డుతామన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షులు వజ్రభాస్క ర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, అంజనాచార్యులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగక పోతే

# వైసీపీకి శంకరగిరి మాన్యాలే..

### - మోదీకి పుత్ర సమానుడు సీఎం జగన్ - సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

**అనంతపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త బ్యూరో**

అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని నమ్మబలికి ఓట్లు దండుకున్న సీఎం జగన్ వారికి అన్యాయం చేస్తే వైసీపీకి శంకరగిరి మాన్యాలే గతి అం టూ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మండి పడ్డారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో గురు వారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకుడు రమణ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోషియేషన్ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 20 వేలు లోపు ఉన్న బాధితులు సుమారు 14లక్షల మందికి 11 వదంల 83 కోట్లు విడుదల చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చాడని, అయితే సీపీఐ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి 2021లో సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించేంత వరకు సీఎం స్పందించలేదని గుర్తు చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ నేపథ్యంలో 14 లక్షల మందికి బాధితులకు డబ్బు ఇవ్వాల్సి ఉండగా కేవలం 10 లక్షల 40వేల మందికి మాత్రమే డబ్బు ఇచ్చారన్నారు. అగ్రిగోల్డ్‌తో 20వేల లోపు నష్టపోయిన బాధితులు ఇప్పటికీ 3 లక్షల 50వేల మంది ఉన్నారని వారందరికీ డబ్బు అందాల్సి ఉందన్నారు. మొత్తంగా మిగిలిన అగ్రిగోల్డ్ బాధితులు 6 లక్షల 50వేల మంది ఉన్నారని వారందరికీ 3వేల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. బాధితులకు సీఎం జగన్ ఇస్తానన్న డబ్బు ఏ ఉచిత సంక్షేమ పథకానికి చెందినది కాదని కేవలం అగ్రిగోల్డ్ నుంచి రావాల్సిన మొత్తమేనని స్పష్టం చేశారు. 2015లో అగ్రిగోల్డ్ మూతబడిన నుంచి అసోషియేషన్ పోరాడు తోందని దేశంలో ఏ కంపెనీ కూడా బాధితులకు డబ్బు వెనక్కి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సిపిఐ ఆధ్వ ర్యంలో జరిగిన పోరాటంతోనే బాధితులకు డబ్బు ముట్టిం దన్నారు. 2019 లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అగ్రిగోల్డ్ ఆస్తులు 30వేల కోట్లు అని నేటి మంత్రులు బొత స సత్యనారాయణ, రోజ వెల్లడిం చారని ఆ క్రమంలోనే వైసీపీ అధినేత వైఎస్ జగన్ 20వేల కోట్లని చెప్పారని గుర్తు చేశారు. అయితే అగ్రిగోల్డ్ కంపెనీ అవినీతి చైర్మన్ అవ్వా రామారావ్ చెప్పిన విధంగా 2015 నాటికి 22 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని బాధితులందరికీ వడ్డీతో చెల్లిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం 40వేల కోట్లకు అగ్రిగోల్డ్ ఆస్తులు పెరిగాయని ముప్పాళ్ల నాగేశ్వర్ రావు చెప్పుకొచ్చారు. టిడిపి హయా ంలో మాజీ సీఎం చంద్రబా బునాయుడు 142 మంది మరణించిన అగ్రిగోల్డ్ బాధితులకు ఒక్కొక్కరికీ 5 లక్షలు పరిహారం చెల్లించాడని గుర్తు చేశారు. ఆ తరువాత ఎన్నికల నేపథ్యంలో జగన్ ఇచ్చిన హామీకి అగ్రిగోల్డ్ బాధితులు సుమారు 60 లక్షల మంది ఆయనకు ఓట్లు వేసి వైసీపీ విజయానికి తోడ్పా టు అందించారని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్‌లో మిగిలిన బాధజతులకు వెంటనే డబ్బు చెల్లించని పక్షంలో వైసీ పీ ప్రభుత్వంపై మరో సమ రానికి అనంతలో శ్రీకారం చు ట్టామన్నారు. అన్ని జిల్లాలో ఉన్న బాధితులను సమీకరించి రానున్న పదినె లల్లో వారం దరిని రోడ్లపైకి తీసుకొస్తామని సీఎం జగన్ అగ్రిగోల్డ్ కంపెనీ పక్షమో బాధితుల పక్షమో తెలుస్తా మ న్నారు. రాష్ట్రంలో ఇంకా అధి కవడ్డీలు చెల్లి స్తామని చెప్పు కుంటూ అగ్రిగోల్డ్ లాంటి దొం గ కంపెనీలు ఉన్నాయని ప్రజలు వాటిని నమ్మవద్దని సూ చించారు. ప్రస్తుతం దేశం లో ఎల్ఐసి, ఎస్బిఐ తది తర ఆర్థిక సంస్థలు సైతం ప్రధాని నరేంద్ర మోదీ, హోమ్ మంత్రి అమిత్ షా, డొల్ల కంపెనీల సృష్టి కర్త అదానీ పుణ్యమా అని నమ్మకాలు కోల్పోయి అమ్మకాలకు గుర య్యాయని ఘాటుగా విమర్శించారు. ఇక రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రధాని మోదీకి పుత్రసమానుడని సాక్షాత్తు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాటల్లోనే నిజం బయట పడిందని ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వం ఎలాంటి దుర్మార్గం చేసినా ఎపి సీఎం జగన్ కుక్కిన పేనులా పడిఉన్నాడని తూర్పారబట్టారు. కేంద్రంలో మోదీ రాష్ట్రంలో జగన్ ప్రజా సంక్షేమాన్ని అధోగతిపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఒకసారి మాత్రమే సీఎం జగన్ 10 లక్షల 40వేల మందికి అగ్రిగోల్డ్ ఆస్తుల నుంచి బాధితులకు డబ్బు చెల్లించి మిగిలిన 6 లక్షల 50వేల మందికి మొండి చెయ్యి చూపిసు్తన్నాడని సాక్షాత్తు ప్రభుత్వ పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర మంత్రులే చెప్పడం విడ్డూరంగా ఉందని ఏకరువు పెట్టారు. తమ వద్ద 10 లక్షల 50వేల కుటుంబాల అగ్రిగోల్డ్ బాధి తులున్నారని సుమారు 45 లక్షల ఓట్లు ఉన్నాయన్నారు. భవిష్యత్ ఎన్ని కలు, అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లు దృష్టిలో ఉంచుకుని వారికి తక్షణమే సీఎం జగన్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి అగ్రిగోల్డ్ బాధజతులను ఆదుకోవాలని లేని పక్షంలో సీఎం జగన్‌కు శంకరగిరి మాన్యాలు తప్పవని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్దయర్శి జాఫర్ మా ట్లాడుతూ.. రాష్ట్రప్ర భుత్వం మెడలు వంచి అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బు ఇప్పిస్తామన్నారు. గతంలో మాజీ సీఎం చంద్రబాబు సైతం రైతుల అనం తరం అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలిచి చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియో అందించారని ఉద్ఘాటించారు. 2015 నుంచి నేటి వరకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు నేతృత్వంలో అగ్రిగోల్డ్ బాధితు లు పోరాడారని గుర్తు. జుపస్తుతం అగ్రిగోల్డ్ బాధితుల పోరాటం మూడవ దశకు చేరుకుందని ఈ ఉద్యమానికి సిపిఐ అండగా ఉంటుం దన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం డబ్బు చెల్లించేంత వరకు తమ పోరా టం ఆగదని అవసరమైతే మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధమౌతామని సిపిఐ జాఫర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోషియేషన్ జిల్లా నాయకుడు ఎరిస్వామి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

## ఫిబ్రవరి 20 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం

- ఫిబ్రవరి 20 నుంచి 07 వరకు ప్రాక్టికల్స్
- మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు థియరీ పరీక్షలు
- జిల్లాలో 83 కేంద్రాల్లో ప్రాక్టికల్స్, 60 కేంద్రాల్లో థియరీ
- మొత్తం పరీక్షలు రాయనున్న విద్యార్థులు 41,186
- జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసి) కేతన్‌గార్గ్

**అనంతపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త బ్యూరో**

ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షల కోసం ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసి) కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. ముందుగా ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 20న ప్రారంభమై మార్చి 7న ముగుస్తాయన్నారు. రెగ్యులర్ విద్యార్థుల ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 07 వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 83 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించను న్నామన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయిన వారం రోజుల తర్వాత మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మొత్తం 60 కేంద్రాల్లో థియరీ పరీక్షలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయన్నారు. పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లుపూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షల ప్రాధాన్యత దృష్ట్యా పరీక్ష కేంద్రాల రూట్లలో సమయానికి బస్సులు నడుపమన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.


**జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్న అభ్యర్థులు**

మొదటి సంవత్సరం-రెగ్యులర్ 17,319, ఒకేషనల్-1280 మొత్తం 18599, రెండవ సంవత్సరం విద్యార్థులు-రెగ్యులర్ 20,977, ఒకేషనల్ 1610 మొత్తం 22,587, మొదటి, రెండు సంవత్సరాల మొత్తం విద్యార్థులు రెగ్యులర్-38,296, ఒకేషనల్ 2,890 మొత్తం 41,186.



కేతన్‌గార్గ్

## కోలూరు అనిల్‌కు భరోసా కల్పించిన మాదినేని ఉమామహేశ్వరనాయుడు


కోలూరు అనిల్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

**కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 16 ప్రభాత వార్త :** మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామం తేదేపా సీనియర్ నాయకుడు కోలురప్ప కుమారుడు కోలురు అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న వారి కుమారుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ.. కళ్యాణదుర్గం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు తెలుగుదేశ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియజేశారు.

## టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

### - టిడిపి రాష్ట్రఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి


ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, యువ నాయకులు డాక్టర్ ఉన్నం మారుతి చౌదరి ప్రారంభించారు. భోజన విరామ సమయంలో ఆర్డిఓ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం, పట్టణ, రూరల్ సర్కిల్ కార్యాలయాలు, ట్రెజరీ, తహశీల్దారు కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని ఉద్యోగస్తులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిరాయల శ్రీనివాసులు,మాజీ కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ డికె రామాంజినేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పాలబండ్ల తిప్పారెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచు సందీప్, మాజీ సర్పంచు కొత్తపల్లి గోవిందరెడ్డి, చిన్నమల్ల చౌదరి, జయప్ప, మాజీ ఎంపిటిసి దోణతిమ్మ చౌదరి, షామీర్, రంగప్ప, పాలబండ్ల రామన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి - ఏపిటిఎఫ్ నేతలు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్

**కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** ఏపిటిఎఫ్ రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు మండల స్థాయి ఉద్యమ కార్యచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల అవలంభిస్తున్న టువంటి నిర్లక్ష్య నిరంకుశ ధోరణికి నిరసనగా కళ్యాణదుర్గం తహశీల్దారు కార్యాలయం ఎదురుగా మండల ఎపిటిఎఫ్ అధ్యక్షులు ఎం.నాగరాజు అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ విద్యా రంగ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఒకటవ తేదినే జీతాలు చెల్లించాలని 11వ పిఆర్‌సిని వేసి ధరల సూచి ఆధారంగా ఫిట్‌మెంట్ నిర్ణయించాలని సిపిఎస్‌ను రద్దు చేయాలని జీవో నెంబర్ 117ను తక్షణమే రద్దు చేసి గ్రామీణ ప్రాంత విద్యా వ్యవస్థను పరిరక్షించాలని బకాయి పడ్డ డిఏలు పిఫ్‌లోన్లు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు బి.చెన్నకేశవ బాల రామ్మోహన్, ఆర్.నారాయణస్వామి, సంగప్ప, ప్రభాకర్, బాలాజీ, రవి, నాగేంద్ర, నాగేంద్రస్వామి, ఆనంద భాస్కర్ రామాంజినేయులు, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వన్నూరుస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక చదివింపులు అందుకుంటున్న స్వామి

**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దర్గా హొన్నూరు గ్రామంలోవెలిసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ వన్నూరుస్వామి దర్గాలో గురువారంలో ప్రత్యేక చదివింపులు నిర్వహించినట్లు దర్గా ముజావర్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి దర్గాకు గంధం అర్పించి, గల్ఫ్ అలంకరించి ప్రత్యేక చదివింపులు (ఫాతెహాలు) నిర్వహించినట్లు వారు తెలిపారు. భక్తులు సైతం స్వామివారి దర్గాలో చదివింపులు నిర్వహించి స్వామి కృపకు పాత్రలు అయ్యారు. కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులు తందూరు వండి స్వామికి అర్పించి అనంతరం భక్తులకు ఉచిత అన్నదానం అందించారు. కొంత మంది భక్తులు చెక్కర తూకాలు నిర్వహించినట్లు దర్గా పెద్దలు తెలిపారు.

## వైసీపీ మాజీ వైస్ ఎంపిపికి మాతృ వియోగం

**బెలుగుప్ప, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :**
మండల పరిధిలో దుద్దుకుంట గ్రామంలో తెలుగుదేశం మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప తల్లి తిమ్మక్క గురువారం సర్వర్గస్తులయ్యారని మండల నాయకులు, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పార్తివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి


నూతన వధువరులతో విశ్వేశ్వర్‌రెడ్డి

**బెలుగుప్ప, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మండలకేంద్రంలో శ్రీషిర్డి సాయి కళ్యాణ మండపంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎంపిటిసి తిప్పేస్వామి నాయక్ నూతన వధువరులను వధువరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి సందడిలో మండల నాయకులు వైఎస్ఆర్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, సింగిల్ విండో ప్రెసిడెంట్ శివలింగ, ఎంపిపి పెద్దన్న కరుణాకర్, రామాంజినేయులు, ఎంపిపి పెద్దన్న, సర్పంచు రామిరెడ్డి, శకుంతలబాయి, వైస్ ఎంపిపి వెంకటరెడ్డి, తిప్పేస్వామినాయక్, సుంక్లానాయక్, పూల ప్రసాద్, రాము, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నార్శింపల్లిని సందర్శించిన ఎంఎల్‌సి రామచంద్రయ్య


తేనేటి విందులో పాల్గొన్న రామచంద్రయ్య

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**
మాజీమంత్రి, ఎంఎల్‌సి కడపకు చెందిన సి.రామచంద్రయ్య శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని నార్శింపల్లి గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ రాజకీయవేత్త, సామాజిక సేవకులు పి.రామలింగారెడ్డి స్వగృహానికి వెళ్లి తేనేటివిందులో పాల్గొన్నారు. అలాగే హరినాథ్‌రెడ్డి, తదితరులు ఎంఎల్‌సిని కలిశారు.

## మున్సిపల్ కార్యాలయానికి కొత్త హంగులు


ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న కమీషనర్

**హిందూపురం, ఫిబ్రవరి 16 ప్రభాత వార్త :** హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో కొత్త హంగులు సంతరించుకున్నాయి. మున్సిపల్ కార్యాలయంలోని హాల్‌లో విధుల్లో వున్న ఉద్యోగులు, సిబ్బంది సేవలు అందించేందుకు కొత్తగా 11 లక్షల రూపాయల వ్యయంతో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ జనరల్ నిధులతో విజయవాడ నుండి తెప్పించిన ఫర్నీచర్‌ను గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని రెవెన్యూ, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, తదితర విభాగాల అధికారులు ఒకేచోట వుండి ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో నూతన ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## రాయల విగ్రహావిష్కరణ


ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం

**హిందూపురం టౌన్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా బలిజసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా బలిజసంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం కాంస్య విగ్రహావిష్కరణ నిర్వహించారు. ఈకార్యక్రమానికిముఖ్యఅతిథులుగారామచంద్రయ్య, ఉదయ భాను, పార్థసారధి, మహాలక్ష్మీ శ్రీనివాస్, నవీన్‌నిశ్చల్, హాజరయ్యారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఉపాధ్యాయులు

**హిందూపురం టౌన్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఇన్‌చార్జ్ తహశీల్దార్ సౌజన్య లక్ష్మికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి అంజనమూర్తి మాట్లాడుతూ సిపిఎస్ వెంటనే రద్దు చేయాలని, పెండింగ్‌లో వున్న డిఏలు చెల్లించి, మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనాన్ని రద్దు చేయాలని అదేవిధంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించి ఉపాధ్యాయులకు ప్రతినెలా 1వతేదీ జీతాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ నాయకులు గురురాజారావు, మల్లికార్జున, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## విడపనకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

### -సొసైటీ ఛైర్మన్ బోయ శ్రీరాములు

**విడపనకల్లు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** విడపనకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా వైసిపి ఉరవకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తున్నట్లు ఆ సొసైటీ ఛైర్మన్ బోయ శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం విడపనకల్లు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి దాదాపు వందలాది మంది రైతులకు ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున ఉరవకొండ ఎడిసిసి బ్యాంకులో వివిధ రకాల రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. పాల్తూరు ఎరువుల విక్రయ కేంద్రంలో దాదాపు రెండు కోట్ల రూపాయల ఎరువులు రైతులకు సరఫరా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో సొసైటీ పరిధిలో మాజీ సిఇఒ ఆధ్వర్యంలో దాదాపు 72 లక్షల రూపాయల అక్రమాలు జరిగాయని వాటిపై విచారణ చేపట్టాలని వ్యవసాయశాఖమంత్రి కాకాని గోవర్ధన్‌కు సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు ఫిర్యాదు చేయడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులను అడ్డుపెట్టుకుని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఉపయోగకరంగా వుండే విధంగా అన్ని విధాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వంఅందించే అన్ని రకాల పథకాలను అందించడంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా అవినీతికి చోటు లేకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీకలగురికి గ్రామ రైతులు శీన, మల్లి, చంద్ర, నాయుడు, లింగప్ప, సుధాకర్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు


రాయల్ ఉత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** గుత్తి మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం విజయ నగర సామ్రాజ్యా దీశుడు శ్రీకృష్ణదేవ రాయల 552వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా రాజీవ్‌సర్కిల్‌లోని రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజల సంక్షేమానికి ఆయన తవ్వించిన చెరువుల గురించి ప్రస్తావించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పగడాల రమణ, సంఘం అధ్యక్షులు రమణ, కార్యదర్శి రామానాయుడు, ఉపాధ్యక్షులు గోవిందరాజులు, కోశాధికారి మంజు, ఆముదాల గిరిధర్, దేవేంద్ర, అరుణ్, రవి, గుత్తికోట సమితి ఛైర్మన్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని బసినేపల్లి గ్రామంలో గోరంట్ల మల్లికార్జున, మాజీ ఎంపిటిసి పులికొండ ఆధ్వర్యంలో రాయల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. రాయలవారి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున బలిజ యువకులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** కర్నాటక నుండి అక్రమంగా రెండు మోటర్‌సైకిళ్లలో మద్యం బాక్స్‌లు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మద్యం బాక్స్‌లతో పాటు రెండు మోటర్‌సైకిళ్ల స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సిఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలిస్తున్న కరావులపల్లికి చెందిన క్రాంతికుమార్, మహేష్‌తో పాటు వానవోలుకు చెందిన పూజారి సురేష్, నంజుండప్పలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 366 మద్యం ప్యాకెట్లతో పాటు రెండు మోటర్‌సైకిళ్ల స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి పెనుకొండ కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సిఐ తెలిపారు.

## నేటి నుండి లేపాక్షి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**లేపాక్షి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం నుండి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మహాగణపతి, సుదర్శనహోమం, స్వామివారి గ్రామోత్సవం, ధ్వజారోహణ, అంకురార్పణ, 18న దీపోత్సవం, రుద్రహోమం, మధ్యాహ్నం స్వామివారి కళ్యాణోత్సవం, నాలుగు యామములో పూజలు, సాయంత్రం వివిధ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 19న ఉదయం స్వామివారి అభిషేకార్చనలు, రథసంప్రోక్షణ, దవనోత్సవం, మధ్యాహ్నం రెండు గంటలకు స్వామివారి బ్రహ్మరథోత్సవం, సాయంత్రం దూలోత్సవం, 20న సింహవాహనోత్సవం, చండీహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రం, సాయంత్రం పార్వ్యాటోత్సవం, రాత్రి 10 గంటలకు ముత్యాలపల్లకి, కీలుగుర్రాల ప్రదర్శన, 21న వసంతోత్సవం, మరియు ధ్వజా అవరోహణ కార్యక్రమం రాత్రికి స్వామివారి శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## గ్రూప్-2కు ఎంపికైన మహిళా కానిస్టేబుల్


మహిళా కానిస్టేబుల్ స్నేహ

**లేపాక్షి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ స్నేహ గ్రూప్-2లో గణాంకాల అధికారిగా ఎంపికైంది. లేపాక్షి మండలం మనెంపల్లి గ్రామానికి చెందిన గోపాల్, పద్మావతి దంపతుల కుమార్తె మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే ఉన్నత కొలువు సాధించాలనే తపనతో ప్రయత్నాలు సాగించింది.ఇందులోభాగంగావిడుదలైన గ్రూప్-2 ఫలితాలో గణాంకాల అధికారిగా ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులతో పాటు తోటి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## ఓటమెరుగని చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు

### -మెయిన్‌రోడ్డులో భారీ ర్యాలీ
### -పురంలో రాయల విగ్రహావిష్కరణకు తరలిన బలిజలు



ర్యాలీ చేస్తున్న దృశ్యం,రాయలు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**చిలమత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** విజయనగర సామ్రాజ్యకీర్తి ప్రతిష్టలు నలుదిక్కులా వినిపించేలా యుద్ధాల్లో ఓటమెరుగని చక్రవర్తిగా పేరుగాంచిన ఏకైక రాజు శ్రీకృష్ణదేవరాయులు అని చిలమత్తూరు బలిజ సంఘం నాయకులు, పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం శ్రీకృష్ణదేవరాయులు 552వ జయంతిని బలిజ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని సంజీవరాయనిపల్లి రోడ్డులో వున్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హిందూపురంలో శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహం ఆవిష్కరణలో పాల్గొనేందుకు అక్కడి నుండి మెయిన్ బజార్ మీదుగా కార్లు, మినీబస్, బొలెరోలు, మోటర్‌సైకిళ్లపై ర్యాలీ చేస్తూ బలిజ ఐక్యత వర్ధిల్లాలంటూ దేవరాయలు జయహో అంటూ నినాదాలు చేశారు. అనంతరం కులప్రముఖులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజు, గొప్ప రాజనీతిజ్ఞుడు, సైన్యాధికారి, భుజబలసంపన్నుడు, ఆర్థికవేత్త, వ్యూహ నిపుణుడు, తదితర గుణాలు కలిగిన గొప్ప చక్రవర్తి అని కొనియాడారు. గొలుసుకట్టు కాలువల నిర్మాణం, చెరువుల పూడికతీత ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. రాయల పాలనలో రత్నాలను రాసులుగా పోసి అమ్మే ఘనచరిత్ర వుందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు దండు సోము, కిరణ్, గోపి, ప్రసన్న, కుల ప్రముఖులు, న్యూ బ్రాడ్మిన్ అధినేత వేణుగోపాల్, మంగళకర సూర్యనారాయణ, డిఎం సిల్క్స్ సంపత్‌కుమార్, వైదేహి ఆసుపత్రి బెంగళూరు తేజస్విని, డాక్టర్ జయరాం పుట్టపర్తి, పులేరు హరి, బలిజకులస్తులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించిన వెన్నపూస శివారెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** ఎంఎల్‌సి ఎన్నికలు మార్చిలో జరగనున్న సందర్భంగా వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని గురువారం వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస శివారెడ్డి పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో, మండలంలోని సచివాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో నిజాముద్దిన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయలు జయంతి ఉత్సవాలకు భారీగా తరలివెళ్లిన గోరంట్ల బలిజకులస్తులు


బైకు ర్యాలీలో పాల్గొన్న బలిజకులస్తులు

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** శ్రీకృష్ణదేవరాయ జయంతి ఉత్సవాలల్లో భాగంగా హిందూపురంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణకు మండలంలోని బలిజ కులస్తులు పెద్దఎత్తున బైకుర్యాలీ నిర్వహించి తరలివెళారు. గురువారం పట్టణంలోని విజయనగర్ కాలనీలో వున్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి దాదాపు 150 మందికిపైగా బైకుల్లో ర్యాలీగా సోమందేపల్లి మండలం గుడిపల్లిలో, హిందూపురంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణకు భారీ సంఖ్యలో బలిజసోదరులు తరలివెళ్లారు.

## ఎస్‌బిఐ కాలనీ అంగన్‌వాడి కేంద్రానికి ఫ్యాన్ వితరణ


ఫ్యాన్ అందచేస్తున్న దృశ్యం

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రానికి ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ టికె దివాకర్ మరియు అతని కుమారుడు లక్ష్మిసాయి విద్యార్థుల సౌకర్యార్థం వేసవిని దృష్టిలో వుంచుకుని ఫ్యాన్ అందచేసినట్లు అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, హెల్పర్ జానకి తెలిపారు. రానున్న వేసవిలో విద్యార్థులకు సౌకర్యంగా వుండాలనే ఉద్దేశ్యంతో దాతులు ముందుకు వచ్చి ఫ్యాన్ అందచేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## వానవోలు జగనన్న కాలనీలో గృహ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ


జగనన్న కాలనీలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**గోరంట్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మండలంలోని వానవోలు జగనన్న కాలనీలో రెండవ విడత కింద మంజూరైన గృహ నిర్మాణాల కోసం పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లులేని లబ్దిదారులకు జగనన్న కాలనీలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల నిర్మాణం చేపట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేయడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేతో పాటు పెనుకొండ నియోజకవర్గం అబ్జర్వర్ బాబురెడ్డి, ఎంపిపి ప్రమీలమూర్తి, సెంట్రల్‌బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, సర్పంచు శ్రీరాములు, ఉపసర్పంచు బుల్లెట్ బాబు, సింగిల్‌విండో అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, మండల కన్వీనర్ లక్ష్మినరసప్ప, ఉగ్గారంపల్లి శ్రీనివాసులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు చేయాలి

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త ప్రతినిధి:**


తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రభుత్వం వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఉద్యోగులకు ఒకటవ తారీఖున జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు గురువారం పుట్టపర్తి తహశీల్దార్‌కు మెమోరాండంసమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 3,4,5 తరగతులు విలీనాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 5 డిఎలను మంజూరు చేయాలని పిఎఫ్, ఎపిజిఎల్ఐలు చెల్లించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.చంద్ర, పుట్టపర్తి మండలం బాధ్యులు హరి ప్రసాద్, రాజశేఖర్, రామకృష్ణ, చెన్నకేశవ, గోపాల్ రెడ్డి, గంగాధర్, సాయిశివ, ఎల్.చంద్ర, ఎర్రిస్వామి, జానకీరామ్, శ్యామ సుందరం, వెంకటేష్ పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధితోనే కురుబల అభ్యున్నతి

### -సామకోటి ఆదినారాయణ

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త ప్రతినిధి:**


కనకదాసు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న సామకోటి ఆదినారాయణ దృశ్యం


కురుబలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలంటే తమ పిల్లలకు విద్యాభివృద్ధి ద్వారానే సాధ్యమౌతుందని శ్రీసత్యసాయి జిల్లా తెదేపా కార్యదర్శి, కురుబ సంఘంనాయకులు సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గం ఆముదాల గొందిపంచాయతీ ఎఆర్.రొప్పం గ్రామంలో భక్తకనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీమంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులతో కలిసి పాల్గొన్న సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ, మహాభక్త కనకదాసు విగ్రహాన్ని కురుబ సోదర, సోదరీమణుల ఐక్యతతో ఘనంగా నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కురుబలు తమ పిల్లలు చదివించుకొని అన్ని శాఖలలో ఉద్యోగాలు మరియు రాజకీయంగా కూడా ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కురుబ సోదరుల కొరకు తన వంతుగా ఆర్థిక సహాయాలు, ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నప్పుడుఇతరాత్ర సహాయం అందించడం తన శక్తి మేరకు చేస్తున్నానని, ఇబ్బందుల్లో ఉన్న వారి ఇళ్ళకు వెళ్ళి పరామర్శిస్తూ యోగక్షేమాలు ఆరా తీస్తుంటానన్నారు. తన వంతుగా కురుబల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా భక్త కనకదాసును ఆలయంలోకి ప్రవేశించకుండా అడ్డుపడితే భగవంతుడే భక్తుడి వైపు తిరిగి కిటికి ద్వారా దర్శనం ఇచ్చేలా తన భక్తిభావం చాటుకున్నాడని, అలాంటి మహనీయుని అడుగుజాడల్లో కురుబలందరూ ఏకమై నడవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

## సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఔదార్యం అభినందనీయం

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త ప్రతినిధి**
భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో వెలుగొందుతున్న శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఔదార్యం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షులు అడపాల వేమనారాయణ కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం మంది పేద పిల్లలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యశిస్తున్నారని, సరైన వసతులు లేక అరకొర సౌకర్యాలతో విద్యాభ్యాసం సాగుతున్నారని, వీరిలో రైతు కుటుంబాలు, వ్యవసాయ కూలీల పిల్లలే ఎక్కువగా ఉన్నారన్నారు. కుటుంబాలు వలసలు పోతే పిల్లలు అవ్వతాతల సంరక్షణలో ఉంటున్నారని, వారికి సరైన పౌష్టికాహారం లేక అనారోగ్యం పాలవుతున్న సందర్భంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పిల్లలకు రాగిజావను అందించడానికి ముందుకు రావడం అభినందనీయన్నారు.

## అవనతం మరిచారు...అవహేళన చేశారు...

### - జాతీయ జెండాకు అవమానం


రంగులు పాలిపోయి కళావిహీనంగా తయారైన జాతీయ జెండా

**కొత్తచెరువు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని నాలుగు రోడ్ల కూడలిలో గత సంవత్సరం 2022, ఆగస్టు 15న ఎగురవేసిన జాతీయ జెండాన్ని అవనతనం చేయడం మరచిన అధికారులు తమ నిర్లక్ష్యంతో జాతీయ జెండా రంగులు పాలిపోయి అవహేళనకు గురౌతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం కారణంగా రద్దీగా ఉండే నాలురోడ్ల కూడలిలో జాతీయ జెండాకు అవమానం జరుగుతోంది. మువ్వన్నెల రంగులతో నిత్యశోభితమై ఉండాల్సిన జాతీయ జెండా, యావత్ భారత జాతికి గర్వకారమణమైన జాతీయ జెండా రంగులు పాలిపోయి కళావిహీనంగా నాలుగురోడ్ల కూడలిలో ఎగురుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతూ భారత జాతి మొత్తానికి తలమానికమైన మువ్వన్నెల జెండా కళావిహీనంగా దర్శనమిస్తుండడంతో పలువురు దేశ భక్తుల హృదయాలు చివుక్కుమంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఆ జాతీయ జెడాను అవనతనం చేసి జెండా విలువలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# పాటల చిత్రీకరణలో 'కస్టడీ'

అక్కినేని నాగచైతన్య, వెంకట్ ప్రభు క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక తెలుగు, తమిళ చిత్రం కస్టడీ.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. లీడ్ పెయిర్ నాగచైతన్య, కృతిశెట్టిపై ఒక పాటను గ్రాండ్‌గా రూపొందిస్తున్నారు. ఈ పాట చిత్రీకరణ కోసం ఏడు విభిన్నమైన భారీసెట్లు వేశారు. ఇళయరాజా , యువన్ శంకర్ రాజా కలిసి ఈచిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పాటకు శేఖర్ మాస్టర్



కొరియోగ్రఫీ అందిస్తున్నారు. సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ కు మంచి స్పందన వస్తోంది.. అరవింద్‌స్వామి విలన్‌పాత్రలో నటిస్తున్నారు ప్రియమణి పవర్‌ఫుల్ పాత్రలో కన్పించనుంది.. నాగచైతన్య కెరీర్‌లో అత్యంత ఖరీదైన చిత్రాల్లో కస్టడీ ఒకటిగా ఉంది.. శ్రీనివాస సిల్వర్‌స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ఈచిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పిస్తున్నారు. ఈచిత్రం మే12న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానుంది

# 'వెయ్ దరువెయ్' టీజర్ రిలీజ్

సుప్రీం హీరో సాయిధరమ్‌తేజ్ చేతులమీదుగా 'వెయ్ దరువెయ్' టీజర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసినిమా టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందన్నారు సినిమా చూడాలి అని కుతూహలాన్ని రేపుతోందన్నారు. సినిమా కచ్చితంగా తెలుగులో సక్సెస్





అవ్వాలని, సాయి అన్నకు, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌కు మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నానని అన్నారు. సినిమాలో పనిచేసిన వాళ్ల అందరికీ ఆల్‌ది బెస్ట్ అని అన్నారు. హీరో సాయి రామ్ శంకర్ మాట్లాడుతూ, సాంగ్స్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. కోటికి పైగా వ్యూస్ రావటం చాలా ఆనందంగా ఉందన్నారు. సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. అందరికీ తప్పకుండా నచ్చుతుందని అన్నారు. దర్శకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ, హీరో సాయి గారు నా మీద ఉంచిన నమ్మకాన్ని జయించానని అనుకుంటున్నానని అన్నారు. ఈ అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్ గారికి థాంక్స్ అన్నారు కార్యక్రమంలో ప్రొడ్యూసర్ దేవరాజ్, హీరో కెరీర్‌లో మంచి హిట్ అవుతుందన్నారు. ఇది మేమంతా గట్టిగా నమ్ముతున్నామన్నారు. మార్చిలో రిలీజ్ చేయటానికి ప్లాన్ చేస్తున్నామని వెల్లడించారు.







# ఈ విజయం 'రైటర్ పద్మభూషణ్'కు రాసిపెట్టుంది: నాని



రైటర్ పద్మభూషణ్ చిత్రం యూనిట్‌ను నాచురల్‌స్టార్ నాని అభినందించారు. సుహాస్ హీరోగా నటించారు. షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించారు. ఈచిత్రాన్ని ఛాయ్‌బిస్కెట్ ఫిల్మ్స్, లహరి ఫిల్మ్స్ బ్యానర్లపై అనురాగ్‌రెడ్డి, శరత్ చంద్ర, చంద్రుమనోహర్ నిర్మించారు.. ఈచిత్రం పెద్ద విజయం అందుకుంది.. స్టార్‌హీరోలు ఈచిత్రంపై ప్రశంసల జల్లు కురిపించారు. తాజాగా నాచురల్‌స్టార్ నాని , రైటర్ పద్మభూషణ్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంతకుముందు చాలా సార్లు చెప్పానని, సుహాస్ నా ఫేవరేట యాక్టర్ అననఆనరు. ఈచిత్రం గొప్పగా ఆడుతోందన్నారు. ఇంత మంది నుంచి ప్రశంసలు వస్తున్నాయన్నారు.. చాలా ఆనందంగా ఉందన్నారు. సుహాస్‌కు అభినందనలు అని

# 'బంగారు తెలంగాణ' త్వరలో రిలీజ్

బిపిన్, రమ్య జంటగా షిరిడీ సాయి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి రమ్య సమర్పణలో సాయిచరణ్, సాయి త్రిశాంక్ నిర్మాణ సారధ్యంలో డాక్టర్ ఏవిస్వామి, డాక్టర్ ఏవీ అనురాధ కోప్రొడ్యూసర్స్‌గా బిపిన్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం బంగారు తెలంగాణ.. సెన్సార్ పూర్తిచేసుకుంది. యు సర్టిఫికెట్ అందుకుంది. అతి త్వరలో తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈసందర్భంగా



నిర్మాత, దర్శకుడు బిపిన్ మాట్లాడారు. ఫిబ్రవరి 17న పుట్టినరోజు జరుపుకుంటున్న ప్రజల మనిషి తెలంగాణ సిఎం కెసిఆర్ అని అన్నారు. బంగారు తెలంగాణ కోసం ఎంతో మంది విద్యార్థులు ఉద్యమాలు చేసి తమ ప్రాణాలను అర్పించారన్నారు. అలాగే కేసిఆర్‌గారు ఆమరణనిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలకు సైతం లెక్కచేయ కుండా పోరాడారని అన్నారు. వారందరి సమిష్టి కృషి కారణంగానే బంగారు తెలంగాణ సాధ్యమైందన్నారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత విషయాలను ఈచిత్రంలో చూపించటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేలా ఈచిత్రం ఉంటుందన్నారు.

# టివి రంగానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి 'తలసాని'

తెలంగాణ సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకలను ఒకరోజు ముందుగానే గురువారం నాడు తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా టెక్నీషియన్లు, వర్కర్స్ ఫెడరేషన్ నిర్వహించింది.. యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ఈసందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు సాయంత్రం దాకా నిర్వహించారు. టివి ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడ నాగబాల సురేష్, ప్రస్తుత ఫెడరేషన్ అధ్యక్షుడు కె.రాకేష్, జనరల్ సెక్రటరీ పి.విజయ్‌మార్, ట్రెజరర్ కె.నరేందర్‌రెడ్డి, గ్రాఫిక్స్ యూనియన్ అధ్యక్షుడ మోహన్‌రాజు, మ్యూజిక్ యూనియన్‌అధ్యక్షుడు ఖుద్దూస్, డాన్సర్ యూనియన్ అధ్యక్షుడు ఇ.రమేష్ ఇలా అన్ని యూనియన్ల తాలుకూ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు




పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుచేస్తూ రాసిన పాట చాలా బాగుందన్నారు. రచయిత, సంగీత దర్శకులకు అభినందనలు తెలిపారు. ఈరోజుల్లో టెలివిజన్ రంగానికి ఎంతోప్రాధాన్యత ఉందని, తెలుగు భాషలోనే అధిక సంఖ్యలో సీరియల్స్ నిర్మాణం జరుగుతున్నట్టు తెలుస్తోందన్నారు. ఫెడరేషన్‌వారు టివి నగర్, టివి భవనన కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని అది ఇచ్చే సందర్భం కూడ త్వరలోనే వస్తుందన్నారు. ఈ రంగంలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారని, అర్హులందరికీ ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి పథకాలన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. టివి రంగానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్ అనిల్ కూర్మాచలం, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, వివికె అధినేత విజయ్‌కుమార్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్సీ పురాణం సతీష్ పాల్గొన్నారు

**తమిళచిత్రం 96లో తనదైన నటనలో ఆకట్టుకున్న గౌరి జి.కిషన్ తర్వాత జాను అనే చిత్రంలో నటించి మెప్పించింది.. ఇపుడామె హీరోయిన్‌గా నటించిన తొలి తెలుగు చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'.. సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్నారు. ప్రశాంత్‌కుమార్‌దిమ్మల దర్శకత్వం వహిస్తున్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈచిత్రాన్ని సుస్మిత కొణిదెల , విష్ణుప్రసాద్ నిర్మిస్తున్నారు.. ఈసినిమాను ఫిబ్రవరి 18న విడుదల చేస్తున్నారు. ఈనేపథ్యంలో హీరోయిన్ గౌరి.జి.కిషన్ మీడియాతో మాట్లాడారు. అమె మాటల్లోనే..**



# అందుకే అన్నీ తెలుసుకుంటున్నా

vaartha.com

2018లో 96తో కెరీర్ స్టార్ట్ చేశా.. అపుడు నేను 12 చదువుతునాన. నా బోర్డ్ ఎగ్జామ్స్ జరుగుతున్నపుడు 98 కోసం ఆర్టిస్టులు కావాలని ఆడిషన్స్ పోస్టర్ కన్పించింది.. నేనెపుడూ నటిగా అవ్వాలని అనుకోలేదు. కానీ ఆడిషన్ గురించి వినగానే మా పేరెంట్స్ చాలా సపోర్ట్‌చేశారు. బేసిగ్గా నేను ట్రెయిన్డ్ భరతనాట్యం డ్యాన్సర్‌ని. నాకు స్టేజ్‌మీద ఉపయోగ పడుతుందని అన్పిస్తే ఆడిషన్స్‌కు వెళ్లమని మా వాళ్లు చెప్పారు. అలాగే ఆడిషన్స్‌కు వెళ్లాను. అది వన్ ఇయర్ ప్రాసెస్ అయింది.. ఒకసారి ఆడిషన్ ఇచ్చాక ఇంకో నాలుగు రౌండ్స్ ఉన్నాయని అన్నారు. వెళ్లాను.. నిజానికి త్రిష చాలా టాల్‌గా ఉంటుంది.. అమె లుక్ ఎలా ఉంటుంది? ఈ అమ్మాయి ఆ లుక్‌కి మ్యాచ్ అవుతుందా. అనే విషయాలు గురించి మాట్లాడారు. అలా 96 మొదలైంది. శ్రీదేవి శోభన్‌బాబు సినిమా పక్కా కమర్షియల్ మూవీ.. ఇందులోనాది చాలా వైవిధ్యమైన పాత్ర. నాపాత్ర చాలా బావుంటుంది. 96లో చేసిన జాను పాత్ర తమిళ సినిమాలోనిదే అయినా.. తెలుగు రాష్ట్రాల్లో చాలా మంచి స్పందన వచ్చింది. ఈచిత్రంలో నా క్యారెక్టర్ అర్బన్ గర్ల్, మోడ్రన్‌గా ఉంటుంది. వైవిధ్య మైన జానుని చూస్తారు. ఫ్యామిలీ అంతా కలిసి చూసి ఎంజాయ్ చేసే సినిమా ఇది. నాకు మలయాళం చదవటానికి, రాయటానికి వచ్చు.. తమిళం ఇపుడు నేర్చుకుంటున్నా. భాష తెలిస్తే నటిగా ఎంతైనా ప్రూవ్ చేసుకోవచ్చు. ఏదైనా బయోపిక్ చేయాలన్నా, ఇంకేమన్నా చేయాలన్నా నేను రెడీగా ఉండాలి. అందుకే నేను అన్నీ నేర్చుకుంటున్నా.. స్క్రీన్ రైటింగ్ కోర్సు కూడ చేశా. కొన్ని ఇష్యూస్ గురించి ఓపెన్‌గా మాట్లాడగా.. మిలియన్ ఫాలోయర్లు ఉన్నపుడు నువ్వేం షేర్ చేయట్లేదని చాలా మంది అడిగారు. అలాంటిపుడు మా అంకుల్ నాకు కొన్ని విషయాల గురించి చెప్పారు. సోషల్‌మీడియాను ప్రెషర్‌గా తీసుకోను.. కానీ స్ట్రాంగ్‌గా ఏదైనా అన్పిస్తే దాని గురించి చెప్పమని అన్నారు. నేను ప్రస్తుతం దాన్ని అర్ధం చేసుకోవటానికి ట్రై చేస్తున్నా. రామ్‌చరణ్ నా ఫేవరేట్ హీరో..